# 53వ రోజుకు రిలే నిరాహార దీక్షలు


మాట్లాడుతున్న సాధన కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ఎదులాపురం, మార్చి 8: ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ వరకు రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్ అండ్‌బీ అతిథి గృహం ఎదుట సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శుక్రవారం 53వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సాధన కమిటీ చైర్మన్, ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, నిమ్మల నరేందర్ మాట్లాడుతూ... ప్రధాని మోదీ వ్యవహారం చూస్తే బీజేపీ ప్రభుత్వం ఇంకా వందేళ్లు పరిపాలించినా ఆదిలాబాద్ సమస్యలు పరిష్కరించేటట్లు లేదని మండిపడ్డారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలో బీజేపీకి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. రైల్వే లైన్ సాధించేంత వరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సాధన కమిటీ సభ్యులు మెస్రం భాస్కర్, రాములు, సాలం వరుణ్, కేశవ్ ఉన్నారు.


బోథ్ : దర్శనం కోసం బారులు తీరిన భక్తులు


మహిళలతో కలిసి కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

## బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

ఎదులాపురం,మార్చి 8: ఆదిలాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న హాజరయ్యారు. ముందుగా మహిళలతో కలిసి కేక్‌కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని కొనియాడారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక సేవల పరంగా మహిళలు ముందుండి నడుస్తున్నారని గుర్తు చేశారు. మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వరూపారాణి, మమత, కరుణ, తులసి, సురేఖ, సంగీత, పర్వీన్, ఉమ, జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ, పట్టణాధ్యక్షుడు అలాల అజయ్, బీసీ పట్టణాధ్యక్షుడు దాసరి రమేశ్, శ్రీనివాస్ తదితరులున్నారు.


ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని కైలాశ్ నగర్ శివాలయంలో బారులు తీరిన భక్తులు


ఇచ్చోడ : పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్


ఎదులాపురం : గంగపుత్ర ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్ దంపతులు


ఇంద్రవెల్లి : నాగోబాకు హారతి ఇస్తున్న పూజారి మెస్రం షేకు

ఎదులాపురం : గంగపుత్ర ఆలయంలో రావి చెట్టుకు పూజలు చేస్తున్న మహిళాలు

దిలావర్‌పూర్ : నంది పాదం వద్ద శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు


శివనామస్మరణ చేస్తున్న యువతి

# శంభోశంకర

**మహా శివరాత్రి సందర్భంగా మారుమోగిన శైవక్షేత్రాలు**

- కనుల పండువగా కల్యాణోత్సవాలు
- భక్తులతో పోటెత్తిన జాతరలు
- ఉపవాస దీక్షలు.. రాత్రంతా జాగరణ
- ఆలయాల వద్ద భారీ పోలీసు బందోబస్తు

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో శుక్రవారం మహాశివరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా సాగాయి. 'ఓం నమ:శివాయ.. హర హర మహాదేవ.. శంభోశంకర..' అంటూ సాగిన శివనామస్మరణలతో శైవక్షేత్రాలు మారుమోగాయి. ఆదిలాబాద్ జిల్లాలోని ఆలయాలతో పాటు ఆదిలాబాద్, నిర్మల్, భైంసా,ఖానాపూర్ పట్టణాల్లోని శివాలయాలు, గోదావరి తీరంలోని ఆలయాలు, ఇంద్రవెల్లి మండలం కెస్లాపూర్‌లోని నాగోబా ఆలయం, నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లోని కదిలి పాపహరేశ్వరాలయం, కాల్వ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, లక్ష్మణచాంద మండలంలోని బాబాపూర్ రాజరాజేశ్వరాలయం, మామడ మండలంలోని బూరుగుపల్లి శివాలయం, దస్తురాబాద్ మండలంలోని గొడిసెర్యాల రాజరాజేశ్వరాలయం భక్తులతో కిక్కిరిశాయి. వేకువ జామునుంచే వాగులు, నదుల్లో పుణ్యస్నానాలు చేసి త్రినేత్రుడిని దర్శించుకున్నారు. రుద్రాభిషేకాలు, శివ పార్వతుల కల్యాణం, లింగోద్భవ పూజలు కనులపండువగా నిర్వహించారు. ఉపవాస దీక్షలు చేపట్టి, రాత్రంతా జాగరణ చేశారు. ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, పాయల్ శంకర్, వెడ్మ బొజ్జుతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పరమేశ్వరుడిని దర్శించుకున్నారు. ఆయాచోట్ల ఆలయ కమిటీలు భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాయి. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.


మామడ : ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ


ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని రవీంద్రనగర్‌లోని శివాలయంలో..


వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన మహిళలతో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

## మహిళలు ఓర్పుతో రాణిస్తున్నారు

**ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు**

ఖానాపూర్, మార్చి 8: నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ఓర్పుతో రాణిస్తున్నారని ఖానాపూర్ ఎమ్మెల్యే ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో నిష్ణాతులైన మహిళలను శాలువాతో సన్మానించారు. మహిళలంతా కలిసి కేక్ కట్ చేశారు. మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం, వైస్ చైర్మన్ సంతోష్, ఏఎంసీ మాజీ చైర్మన్ గంగనర్సయ్య, నాయకులు దయానంద్, రమేశ్, సత్యం, షబ్బీర్‌పాషా, సచిన్, శోభన్, సీడీపీవో సరిత, మహిళలు పాల్గొన్నారు.

# మత్తు మందుల మాయాజాలం

**నిబంధనలను అతిక్రమించి హెచ్-1 డ్రగ్స్ విక్రయాలు**

- అడిగితేనే బిల్లులు.. మందుల నియంత్రణపై నిఘా కరువు..
- నిర్మల్ జిల్లాలో ఇష్టారాజ్యంగా మెడికల్ షాపుల నిర్వహణ
- పట్టించుకోని డ్రగ్ కంట్రోల్ శాఖ అధికారులు



ఇటీవల కుంటాల మండలంలోని ఓ మెడికల్ షాపును సీజ్ చేసి, నిషేధిత మందులను స్వాధీనం చేసుకున్న అధికారులు(ఫైల్)

నిర్మల్, మార్చి 8(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లాలోని పలు ప్రైవేట్ మెడికల్ షాపుల్లో పెద్ద ఎత్తున మత్తు మందుల విక్రయాలు కొనసాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నెల రోజుల క్రితం పలు మెడికల్ షాపుల్లో తనిఖీలు నిర్వహించిన టాస్క్‌ఫోర్స్ బృందాలు ఆరు దుకాణాల్లో నిబంధనలకు విరుద్ధంగా షెడ్యూల్ హెచ్-1 మత్తు మందులను అమ్ముతున్నట్లు నిర్ధారించారు. షెడ్యూల్ హెచ్-1బీ ప్రకారం మొత్తం 46 రకాల మందులను అమ్మేటప్పుడు నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. ముఖ్యంగా క్వాలిఫైడ్ డాక్టర్ రాసిచ్చిన ప్రిస్క్రిప్షన్ ఉంటేనే ఈ మందులను విక్రయించాలి. అలాగే హెచ్-1 రిజిస్టర్‌లో తప్పనిసరిగా మందుల క్రయవిక్రయాల వివరాలను నమోదు చేయాలి. దీంతోపాటు బిల్లును కూడా తప్పనిసరిగా కొనుగోలుదారునికి ఇవ్వాలి. అయితే జిల్లాలోని అనేక మెడికల్ షాపుల్లో ఈ నిబంధనలను యాజమాన్యాలు పట్టించుకోవడం లేదన్న ఫిర్యాదులున్నాయి. అధికారులు మత్తు మందుల అమ్మకాలపై సీరియస్‌గా తీసుకోక పోతుండడం.. మెడికల్ వ్యాపారులకు వరంగా మారుతున్నది. మత్తు ఫార్ములాతో కూడిన ట్యాబ్లెట్లు, సిరప్‌లను అమ్ముతూ మెడికల్ షాపుల యాజమాన్యాలు లక్షల రూపాయలను ఆర్జిస్తున్నాయన్న విమర్శలున్నాయి. ప్రతి మెడికల్ షాపులో ఫార్మాసిస్టు ఉండాలని, కొనుగోలుదారుకు బిల్లులు ఇవ్వాలని, బిల్లుపై బ్యాచ్ నంబర్, తయారీ తేదీ, గడువు తేదీ ఉండాలన్న నిబంధన ఉన్నది. ఎవరు కూడా బిల్లులు ఇవ్వడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కాగా.. ఇటీవల నిబంధనలను అతిక్రమించి హెచ్-1 మందులను విక్రయించిన కుంటాల మండలంలోని లింబా(కే) గ్రామంలోని ఒక మెడికల్ షాపును అధికారులు సీజ్ చేశారు. భైంసా పట్టణంలోని ఐదు మెడికల్ షాపులపై సస్పెన్షన్ వేటు వేశారు. అయినప్పటికీ మందుల దుకాణాల యాజమాన్యాలలో మార్పు మాత్రం కనిపించడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. కాగా.. సరైన మెడికల్ షాపుల నిర్వాహకులు జనరిక్ మందులను కూడా అంటగడుతున్నారన్న విమర్శలున్నాయి.

### ఆర్ఎంపీలతో ములాఖత్

పల్లె ప్రాంతాల్లోని మెడికల్ షాప్‌ల నిర్వాహకులు అక్కడి ఆర్ఎంపీలతో ములాఖత్ అవుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఒక్కో ప్రిస్క్రిప్షన్‌పై మొత్తం మందుల కొనుగోళ్లను బట్టి ఆర్ఎంపీలకు కమీషన్‌లు చెల్లిస్తుంటారని చెబుతున్నారు. ఎమ్మార్పీ ఎక్కువగా ముద్రించి ఉన్న మందులను రోగులకు అంటగడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే ఆర్ఎంపీలు ఎక్కువ పర్సెంటేజీ వచ్చే మందులను రోగులకు అంటగడుతున్నారు. తనిఖీలు లేకపోవడంతో ఆర్ఎంపీలు, అక్కడి మెడికల్ వ్యాపారుల దోపిడీ ఇష్టారాజ్యంగా కొనసాగుతుందన్న విమర్శలున్నాయి. ఇప్పటికైన అధికారులు జిల్లాలోని మెడికల్ షాపుల్లో తూతూ మంత్రంగా తనిఖీలు చేసి చేతులు దులుపుకోకుండా, నిరంతర తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


కేక్ కట్ చేస్తున్న వైద్య సిబ్బంది

## నిర్మల్ దవాఖానలో..

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 8: నిర్మల్ ప్రధాన దవాఖానలో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. దవాఖాన వైద్య సిబ్బంది కేకు కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. ఆర్ఎంవో గణేశ్, డా. శ్రవణ్, నర్సింగ్ సూపరింటెండెంట్ కమలమ్మ, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ హేమలత, కిరణ్మయి, జయలక్ష్మి, అపర్ణ, నౌషీన్, టీఎన్జీవో నాయకులు అబ్బు అమీర్, సంతోష్ కుమార్, దవాఖాన వైద్య సిబ్బంది ఉన్నారు.


బీటీ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

## గ్రామాలాభివృద్ధికి ప్రత్యేక కృషి

**ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్**

ముథోల్, మార్చి 8 : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే రామారావు పటేల్ తెలిపారు. మండలంలోని తరోడా తండా గ్రామానికి రూ. కోటీ 4 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏళ్ల తరబడి రహదారి నిర్మాణం సరిగ్గా లేక, తండా వాసులు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. వారి ఇబ్బందులు తొలగించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నాణ్యతలో రాజీలేకుండా పనులు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తాను ఎల్లవేళలా కృషి చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఎంపీపీ అయేషా అఫ్రోజ్ ఖాన్, మాజీ జడ్పీటీసీ లక్ష్మీనర్సాగౌడ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సురేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రవికిరణ్ గౌడ్, అరిఫ్, ఎంపీటీసీ గంగాధర్, బీజేపీ మండలాధ్యక్షుడు పోతన్న, నాయకులు శ్రీనివాస్, సప్పటోల్ల పోతన్న, తదితరులున్నారు.

### నేడు చెక్కుల పంపిణీ

ముథోల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే రామారావు పటేల్ రానున్నట్లు బీజేపీ మండల ఇన్‌చార్జి తాటివార్ రమేశ్, మండలాధ్యక్షుడు కోరి పోతన్న తెలిపారు. ఈ కార్యక్రమానికి లబ్ధిదారులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

### బీటీ రోడ్డు పనులు ప్రారంభం

బాసర, మార్చి 8: మండలంలోని టాక్లి గ్రామంలో బీటీ రోడ్డు పనులను ఎమ్మెల్యే రామారావు పటేల్ శుక్రవారం ప్రారంభించారు. టాక్లి నుంచి లాబ్ది వరకు బీటీ రోడ్డు నిర్మించనున్నారు. స్థానిక నాయకులు ఉన్నారు.


సేవాలాల్ దీక్ష స్వీకరణకు తరలివచ్చిన భక్తులు


దీక్షాగురువు ప్రేమ్‌సింగ్ మహరాజ్ ఆశీస్సులు తీసుకుంటున్న భక్తులు

# తండాల్లో ఆధ్యాత్మిక సందడి

- సేవాలాల్ దీక్షలు ప్రారంభం
- శ్రీరామనవమికి విరమణ

నార్నూర్,మార్చి8: లంబాడాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ దీక్షలతో తండాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. యేటా మహాశివరాత్రి పర్వదినం నుంచి శ్రీరామ నవమి వరకు 41రోజుల పాటు లంబాడాలు సేవాలాల్ దీక్ష స్వీకరిస్తారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని కొత్తపల్లి(హెచ్)జాతీయ దీక్షభూమిలో దీక్షాగురువు ప్రేమ్‌సింగ్ మహరాజ్ ఆధ్వర్యంలో భక్తులు దీక్ష తీసుకుంటారు. నియమనిష్టలతో దీక్ష కొనసాగిస్తారు. భక్తులు వాళ్ల వీలును బట్టి 41, 21, 11 రోజుల పాటు మాలాధారణ చేస్తారు. తండాలు సేవాలాల్ నామంతో మార్మోగనున్నాయి. ఒక పూట మాత్రమే భోజనం చేస్తారు. పండ్లు, ఫలహారాలు మాత్రమే తీసుకుంటారు. సాయంత్రం ఒకచోటే ప్రత్యేక పూజలు చేస్తారు. వ్యసనాలకు దూరంగా ఉంటారు. శ్రీరామ నవమి రోజున మహారాష్ట్రలోని యావత్‌మాల్ జిల్లా పౌరాదేవిలో ప్రత్యేక పూజ లు చేసి దీక్ష విరమిస్తారు.


పూజలు చేస్తున్న గురువు

### సమాజ చైతన్యం కోసమే..



లంబడాలు, బంజారాల సమాజ జాగృతి కోసం సేవాలాల్ దీక్షలు స్వీకరించాలి. దీక్షల వల్ల సంస్కృతీసంప్రదాయాలను భావి తరాల వారికి అందించినవారవుతారు. జాతి ఐక్యత కోసం, చైతన్యం కోసం లంబాడాలు దీక్షలు స్వీకరించాలి. ఆధ్యాత్మికత పెంపొందించడంతో పాటు సన్మార్గంలో నడిచేలా చేస్తాయి.

-ప్రేమ్‌సింగ్ మహరాజ్(దీక్షగురువు)